


## గుణపాఠము

మాటౌనుకు క్రొత్తగా వచ్చిన సబ్ మేజిస్ట్రేటు నిరాడంబర వృద్ధుడు. ఇతడు బీచ్‌కు షికారువెళ్లి మూత్రవిసర్జనచేయుచుండగా పోలీసుకానిస్టేబిలు పేరు నోట్‌చేసి హోదాతెలియక స్టేషనుకు రమ్మన్నాడు. కాని రెండు రూపాయిలు బహుమానమిచ్చి తాను మేజిస్ట్రేటునని తెలియపరచకయే తప్పించుకొని టోపీనెంబరు నెమరువేసినారు. సాయంత్రముకాగా గృహోన్ముఖులగుటను త్రోవలో బైసికిలుమీద పోవు సబ్‌ఇన్‌స్పెక్టరు దిగి 'గుడ్ ఈవినింగ్' అని మర్యాదచేసినారు. ఇదంత వెంబడి వచ్చే కానిస్టేబిలుచూచి బిక్కమొగము వైచి సబ్‌ఇన్‌స్పెక్టరువల్ల ఆతనిని సబ్ మేజిస్ట్రేటుగా తెలిసికొని ఆరాత్రే వారి యింటికిపోయి తాను పుచ్చుకున్న రెండు రూపాయిలు పెట్టి కాళ్ళపైబడి క్షమాపణవేడేడు. సబ్‌మేజిస్ట్రేటు దయపూని యికముందెవ్వరియొద్ద లంచము పుచ్చుకోవద్దని ప్రమాణము చేయించి గుణపాఠము నేర్పి కటాక్షించారు.

సనపల వెంకటనాయుడు.

* * *

## అదృష్ట జాతకుడు

స్థూలమైన శరీరం. ఏనుగు తలలాంటి శిరస్సు, ఇంకెందుకు విఘ్నేశ్వర అవతారం అనవచ్చు. నెత్తిన టోపి, పైన కండువా, చేతిలో బెత్తం ధరించి ఒక కొలను గట్టున కూచొని ఆకాశంవైపు వెర్రిచూపులు చూస్తూ కాలాన్ని వృథా చేస్తున్నాడు. వాయుదేవుడు సరదాకోసం ఒకపెట్టున రెండు చెవులు వాయించడంతో టోపీ కాస్తా నీటిలో కుంకిపూరుకుంది. మన వీరుడు బద్ధకంతో ముందుకొంగి బెత్తం కొనతో టోపీ తీయబోతే పై పంచకూడా దాన్ని చేరుకుంది. ఒళ్ళుమండి బెత్తాన్నికూడా నీళ్ళలోకి విసిరి పారేశి గబుక్కున పైకి లేచి వెళ్ళబోయినాడు. మళ్ళీ ఏమనుకున్నాడో, గబగబా కొలనులోకి దిగి టోపిని, పైపంచను, బెత్తాన్ని సేకరించబోయినాడు. ఒళ్ళు తన స్వాధీనంలో వుండేగా, శుభ్రంగా నీటిలోపడి పూరుకున్నాడు!

చెరుకుమూడి రాధాకృష్ణమూర్తి.

* * *

## కమాన్ లేడీ

మావూళ్ళో ఒక ఆంగ్లోఇండియన్ లేడీవుంది. మాశాస్త్రి ఆ లేడీకి Sights వేసేవాడు. కాని ఆలేడీమాత్రం మాశాస్త్రి వాలకం(అంటే చేష్టలే సుమండీ;) జూచి అదోమాదిరి ఏవగింపు భావంతో పోయేది. అయినప్పటికీ మాశాస్త్రి కార్యదీక్షాకంకణబద్ధుడవడంచేత తన కార్యక్రమం మానలేదు. శాస్త్రిని చూచినప్పుడల్లా ఆ తనూజమాత్రం ఓ వెయ్యడుగుల దూరంలోనుంచి పోవాలని ప్రయత్నించేది. కాని [కొంగుతగిలితే కోటి వేలన్న సామెతలో మాశాస్త్రిఉన్నప్పుడు అప్రయత్నంగా ఆమె శాస్త్రిప్రక్కనుంచే పోవలసివచ్చేది. ఆలేడీ శాస్త్రి యందు మరింత క్రోధావేశమానస పూరితురాలైవుంది వీలైతే శాస్త్రిని పల్టీ కొట్టిద్దామని. ఇంత విరుద్ధాభిప్రాయంలో వుండడం జూచి శాస్త్రి ఆమె నెలాగైనా Stunt తినిపించాలనే పట్టుదలలోనికి దిగాడు. తను ఒక లేడీపిల్లను మిక్కిలి ఆప్యాయంగా పెంచుతున్నాడు. దానికి కొన్నిసంజ్ఞలుకూడా నేర్పాడు, ఒకరోజున ఆ ఆంగ్లోఇండియన్‌లేడీ బయలుదేరి రావడంజూచి తన లేడీపిల్లను తనకు కొంతదూరములో మేపుతున్నాడు. మిత్రబృందాన్ని దగ్గరఉంచుకొని ఆ చపలాక్షి, తనకు దగ్గరగా రాగానే ఆమెను జూచి "కమాన్‌లేడీ" అని ఎంతో హుందాగా పిలిచాడు. ఆమానిని ఆమాట వినగానే శాస్త్రిని నమిలిమింగేద్దామనేంతకోపంతో చురచుర చూపులు చూచింది "కమాన్‌లేడీ" అనగానే తన పెంపుడు లేడీపిల్ల చెంగున ఎగిరివచ్చి వడిలో వాలింది. ఇప్పుడా ఆంగ్లో ఇండియన్ లేడీ కోరచూపులు కొరగాకుండా పోయాయి. మిత్రబృందమంతా ఒక్కటేనవ్వు. ఆవనిత విసవిస వెనుదిరిగి చూడకుండా చక్కాపోయింది.

సవరం నరసింహారావు.